
స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

నమో లక్ష్మీ నరసింహో..!

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం

కదిరి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ మాసం చివరి శనివారం కావడంతో పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే బారులుతీరారు. స్వామివారి ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయానికి శుక్రవారం రాత్రే పలువురు చేరుకున్నారు. దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ అధికారులు సౌకర్యాలు కల్పించారు.


కొత్తపల్లికి వెళ్లే బండి జాడ

రోడ్డు లేని ఊరు

- నేటికి ఆ గ్రామానికి కాలిబాటే దిక్కు
- గ్రామానికి వెళ్లాలంటే సర్కస్ ఫీట్లు తప్పవు
- ఇబ్బందులు పడుతున్న కొత్తపల్లి ప్రజలు

దశాబ్దాలు గడుస్తున్నా మండలంలోని కొత్తపల్లి గ్రామ అభివృద్ధిలో మాత్రం ఎలాంటి ప్రగతి కనిపించడం లేదు. నేటికి ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. ఇదే పెద్ద సమస్యగా మారింది. గ్రామానికి రావాలంటే బండిజాడ లేదా కాలిబాటే దిక్కు. ఈగ్రామం కొర్తికోట పంచాయతీలో ఉంది. గ్రామంలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయి. 232మంది జనాభా ఉన్నారు. వీరందరూ వ్యవసాయం, పశుపోషణ, వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎన్నోఏళ్లుగా అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. అసౌకర్యాల మధ్య జీవించలేక కొన్ని కుటుంబాలు గ్రామాన్ని వదిలి వెళ్లిపోయాయి. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి ఓట్లు వేసి, వెళ్లి పోతున్నారు.

- తనకల్లు, ఆంధ్రజ్యోతి

అత్యవసరమైతే అంతే...

గ్రామస్థులకు రాత్రి పూట ఏదైనా సమస్య తలెత్తి వేరే ఊరికి వెళ్లాలంటే అంతే. రోడ్డులోకి రావాలంటే ఎటువైపు నుంచైనా కాలిబాటలో రావాల్సిందే. గ్రామం నుంచి కొక్కంటి రోడ్డుకు రావాలన్నా, తుమ్మవారిపల్లి రోడ్డుకు పోవాలన్నా రెండు కిలోమీటర్లు కాలినడకన రావాల్సిందే. గ్రామంలోకి ఆటోలుకానీ, ట్రాక్టర్లుకానీ వచ్చే వీలు లేదు. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండించిన పంటలను అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. మనుషులకైనా, పశువులకైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గ్రామానికి వచ్చే నాయకులందరూ రోడ్డు వేయిస్తాం. ఇళ్లు కట్టిస్తామని చెప్పడమే తప్ప చేసింది లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు కూడా గ్రామంలోకి రాకపోవడంతో ఆస్పత్రులకు వెళ్లడానికి గర్భవతులు, వృద్ధులు పడరాని పాట్లు పడుతున్నట్లు చెబుతున్నారు. ఈ ఊరికి పెళ్లి సంబంధం మాట్లాడాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించుకునే పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి రోడ్డు సౌకల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నా భార్యను ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోయా..



నాభార్య ఇంటిలో కాలు జారి పడింది. గ్రామం నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లడానికి కొక్కంటికెళ్లి ఆటో వారిని బతిమాలాను. రోడ్డు సౌకర్యం లేక వారు ఎవరూ రాలేదు. దీంతో నేను ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లి, వైద్యం చేయించలేకపోయా. బాధను భరించలేక ఆమె రెండురోజులకే చనిపోయింది. రోడ్డు కోసం ఎన్నో ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నా, పట్టించుకోలేదు. ఎప్పటికి మాగ్రామానికి రోడ్డు సౌకర్యం వస్తుందో..?

- లక్ష్మీనారాయణ, కొత్తపల్లి



మహిళల బాధలు మరెన్నో..

గ్రామంలో మహిళల బాధలు చెప్పుకోలేం. గర్భవతులు గ్రామం నుంచి రోడ్డులోకి వెళ్లడానికి పడే బాధలు చెప్పనలవికాదు. తిమ్మనాయుని చెరువు నిండి, వరి పంట సాగుచేస్తే కాలిబాటలోకూడా నడవలేని పరిస్థితి. బాలింతలు, పురిటి పిల్లలను అత్యవసరంగా తీసుకెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. కాలిబాట సైతం బురదమయం అవుతుంది. ఓట్ల కోసం వచ్చే నాయకులు రోడ్డు వేస్తామంటారేకానీ, తరువాత మాగోడు పట్టించుకోరు.

- సుజాత, గొర్రెల కాపరి, కొత్తపల్లి

నా దృష్టికి రాలేదు: రెడ్డెప్ప, ఎంపీడీఓ

కొత్తపల్లి గ్రామానికి రోడ్డు లేని విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే సమస్యను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా.

మత్తు దిగే నిజాలు

- 'పురం'లో వేళ్లూనుకున్న మత్తు పదార్థాలు !
- వాడకంలోకి కొత్త రకం మత్తు
- దుష్ప్రభావంపై పోలీసుల హడల్
- కీలక సూత్రధారి కోసం అన్వేషణ
- లోతుగా సాగుతున్న విచారణ



మూలాల కోసం..

సామూహిక అత్యాచారం కేసులో పరారీలో ఉండి ఇటీవల పోలీసులకు చిక్కిన కీలక నిందితుడు చాకలి శ్రీనివాస్ ఇచ్చిన సమాచారంతో మత్తుమందు గురించి పోలీసులకు అదనపు సమాచారం అందినట్లు తెలుస్తుంది. దీంతో ఆదిశగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందుకోసం సాంకేతికంగా పేరు గాంచిన కీలక నిఘా వర్గాల్లో పనిచేసి వచ్చిన ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. డీఎస్పీ పర్యవేక్షణలో ఈ కేసుకు సంబంధించి లోతుగా విచారణ సాగుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే మూలాలు దొరికే అవకాశాలు కనబడుతున్నాయి.



చిలమత్తూరు వద్ద పట్టుబడిన గంజాయి (ఫైల్)

హిందూపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు హిందూపురం ప్రాంతంలో వేళ్లూనుకున్నట్లు స్పష్టం అవుతోంది. సామూహిక అత్యాచారం కేసులో నిందితుల్ని పట్టుకునే క్రమంలో పోలీసులు నివ్వెరపోయే నిజాలు వెలుగు చూసినట్లు సమాచారం. ఇప్పటి వరకు వెలుగులోకి రాని మత్తుమందు హిందూపురం ప్రాంతంలో వాడుతున్నట్లు తెలిసింది. ఇది మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని సమాచారం. ఈ విషయాలు తెలుసుకున్న పోలీసులు మూలాలు కనుగొనేందుకు అన్వేషిస్తున్నారు. పోలీసులు లోతుగా అత్యంత రహస్యంగా మత్తుమందుల గురించి ఆరా తీస్తున్నట్లు సమాచారం. సామూహిక అత్యాచార నిందితులు ఇచ్చిన సమాచారంతో మత్తుమందు క్రయవిక్రయాలు చేసే వారిపై నిఘా ఉంచి దాదాపు 15 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది.

వెలుగులోకి మరో మత్తుమందు

ఇటీవల పోలీసులకు పట్టుబడిన వారిచ్చిన సమాచారంతో కొత్తరకం మత్తుమందు వెలుగులోకి వచ్చింది. ఇది మాత్రలు, పౌడర్ రూపంలో హిందూపురంలో చలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. దీన్ని ఎండీ డ్రగ్స్‌గా పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక గ్రాము విలువ సుమారు రూ.2500వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇది నాలుకపై వేసుకున్న తర్వాత 6 నుంచి 8గంటల వరకు మనిషి మానసిక స్థితిని అలాగే ఉంచుతుంది. ఒక వ్యక్తి మామూలుగా నవ్వుతూ ఆనందంగా ఉంటే అలాగే ఉండనిస్తుంది. లేదా సైకోలా వ్యవహరించే వ్యక్తి దీనిని నాలుకపై వేసుకుంటే మరింత సైకోగా మార్చే స్వభావం దీనికి ఉంటుంది. అంటే మనిషి మానసిక స్థితిని బట్టి దానిని రెట్టింపు చేసే మత్తు ఇందులో ఉంటుంది. ఇటీవల కొంతమంది యువత దీనిని తీసుకోవడంతో వారికి ముక్కు నుంచి రక్తం వచ్చింది. ఇంకా ఎక్కువ రోజులు తీసుకుంటే నోటినుంచి కూడా రక్తం వచ్చే స్వభావం ఈ మందులో ఉంటుందని పోలీసులకు వైద్యులు చెప్పినట్లు సమాచారం. ఇలా ఈ మత్తు మందు తీసుకుని ముక్కు నుంచి రక్తం కారుతున్న యువత సుమారు 200 మంది ఏడాది కాలంలో ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. వైద్యులకు ఈ విషయం తెలియక ఉష్ణం వల్ల వచ్చి ఉండవచ్చని భావించి, అందుకు తగ్గట్లు చికిత్స అందించారు. ఇందులో కొంతమంది యువతకు మేలుకాకపోవడంతో బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మత్తుమందు తీసుకున్నట్లు తల్లిదండ్రులకు తెలపడంతో వారు నివ్వెరపోయారు. ఇటీవల పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుల ద్వారా మత్తుమందు తీసుకున్న యువకుల కుటుంబ సభ్యులతో పోలీసులు రహస్యంగా విచారించారు. ఈ విచారణలో వారు పలు వివరాలు వెల్లడించినట్లు తెలుస్తుంది. ఈ మత్తుమందు వీలైనంత త్వరగా అరికట్టకపోతే నేరాలు పెరగడమేకాక యువత అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

సూత్రధారి కోసం అన్వేషణ



పోలీసుల విచారణలో వెలుగు చూసిన విషయాల ఆధారంగా పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. కీలక సూత్రధారికి ఈ విషయం తెలియడంతో అతడు హిందూపురం నుంచి పరారైనట్లు సమాచారం. ఈ కీలక సూత్రధారి బెంగళూరులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కొందరు నైజీరియన్ల ద్వారా ఈ ఎండీ డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. ఆ కీలక సూత్రధారికి కొంత మంది పోలీసులు సహకరించడంతోనే హిందూపురం నుంచి పరారైనట్లు తెలుస్తోంది. గంజాయి మత్తుకే లెక్కకు మించి నేరాలు జరుగుతుంటే కొత్త మత్తు మందుతో ఇంకెన్ని రకాల ఘోరాలు జరుగుతాయో, వాటిని ఎలా అదుపు చేయాలోనని పోలీసులు ఆందోళన చెందుతున్నారు.

దర్యాప్తు చేపడుతున్నాం

ఇటీవల ఓ నేరంలో దొరికిన నిందితులను విచారించగా వారు చెప్పిన విషయాలు బట్టి మరి కొంతమందిని విచారించాం. ఇక్కడ గంజాయితోపాటు మరో కొత్తరకం మత్తుమందు ఉన్నట్లు భావిస్తున్నాం. ఆ దిశగా దర్యాప్తు చేపడుతున్నాం. ఈ మూలాలు కనుక్కోవడానికి కొంత సమయం పడుతుంది. ఉంటే మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

మృత్యు సంకీర్తన

- పరంధామా.. ఇంత ఘోరమా..!
- గుండె పగిలిన శ్రీకృష్ణ భక్తులు
- ఆరుగురిని మింగిన ప్రమాదం
- నాయనపల్లి క్రాస్ వద్ద ఘోరం
- టైరు పేలి.. లారీని ఢీకొన్న కారు

ఘోర రోడ్డు ప్రమాదం ఆరుగురు శ్రీకృష్ణ భక్తులను బలితీసుకుంది. భక్తుడి గృహ ప్రవేశంలో స్వామివారి సంకీర్తలను పాడి.. తన్మయత్వంతో తిరుగు ప్రయాణమైనవారిని మృత్యువు కబళించింది. టైరు పేలడంతో అదుపు తప్పిన వారి కారు.. ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. క్షణాల్లో అందరి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వారిని కాపాడే అవకాశం కూడా స్థానికులకు లభించలేదు. సహాయక చర్యలు చేపట్టేందుకూ వీలు లేనంతగా లారీ కింద కారు ఇరుక్కుపోయింది. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో గంటపాటు శ్రమిస్తేగానీ మృతదేహాలను వెలికి తీయలేకపోయారు. ప్రమాద స్థలం భయానకంగా కనిపించింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మృతుల బంధువులు గుండెలవిసేలా రోదించారు. మృతదేహాలను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడికి మృతుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇస్కాన్ భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. 'నిత్యం నీ ధ్యాసలోనే బతికే భక్తులను ఇంత ఘోరంగా తీసుకెళ్లావా పరంధామా..' అని కంటతడి పెట్టుకున్నారు. తెల్లటి దుస్తులు, నుదుట స్వామివారి తిరునామం, చెరగని చిరునవ్వులే ఆభరణాలుగా కనిపించే భక్తులు.. రక్తం పులుముకున్న దుస్తులతో అచేతనంగా కనిపించడాన్ని జీర్ణించుకోలేకపోయారు.

(వివరాలు మెయిన్‌లో, 7లో..)





డీఈఓ బాధ్యతల స్వీకరణ



కొత్తచెరువు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయిజిల్లా ఇన్‌చార్జ్ డీఈఓగా జి.కిష్టప్ప శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీఈఓ మీనాక్షి బదిలీపై ప్రొద్దుటూరు డీవైఈఓగా వెళ్లారు. అక్కడ డీవైఈఓగా పనిచేస్తున్న జి.కిష్టప్ప బదిలీపై ఇక్కడికి ఇన్‌చార్జ్ డీఈఓగా వచ్చారు. ఈయనకు విద్యాశాఖ అధికారులు, సిబ్బంది., ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సాయి సన్నిధిలో వెనుజులా ఉపాధ్యక్షురాలు



పుట్టపర్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వెనుజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిడ్జ్ ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని శనివారం దర్శించుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి వచ్చిన ఆమెకు సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆమె ప్రత్యేక కాన్వాయ్‌లో ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం శాంతి భవన్‌కు వెళ్ళి రాత్రికి బస చేశారు. ఆమె ఆదివారం ఢిల్లీ వెళ్లనున్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్


వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

హిందూపురం అర్బన్, అక్టోబరు, 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ చేతన్ పేర్కొన్నాడు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించడానికి వైద్యులు నర్సులు, సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రోగులకు మందులు, సర్జికల్ ఐటమ్స్ అందుబాటులో ఉన్నాయా లేవా? అని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి అభివృద్ధి నిధులు కేటాయించినట్లు తెలిపారు. దీంతో మరిన్ని మెరుగైన సేవలు అందించే అవకాశం ఉందన్నారు. రక్తనిధి కేంద్రంలో ఉన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మాతాశిశు కేంద్రానికి సంబంధించి మరో భవనం నిర్మాణంలో ఉందని, మరో ఆరు నెలల్లో ఆ భవనం అందుబాటులోకి తెస్తామన్నారు. సూపరింటెండెంట్, ఆర్ఎంఓ ప్రతి రోజు అన్ని వార్డులు తిరిగి వైద్యులు, సిబ్బంది పనితీరు పరిశీలించా లన్నారు. అత్యవసర విభాగంలో 24 గంటలు సేవలు అందేలా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మాతా శిశు మరణాలు జరగకుండా శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ తిప్పేంద్రనాయక్, సూపరింటెండెంట్ లింగణ్ణ, ఆర్ఎంఓ డేవిడ్‌రాజ్, మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, కమిటీ మెంబర్లు విద్యాసాగర్, శ్రీదేవి, ప్రభుకుమార్, లక్ష్మీనరసింహ, ఎన్టీఆర్ వైద్యఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ శ్రీదేవి, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రత్నాకర్

పుట్టపర్తి అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో విలువలతో కూడి విద్యను అందించాల్సిన అవసరం ఉందని సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే పేర్కొన్నారు. స్థానిక ప్రశాంతి నిలయంలో సత్యసాయి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ స్కూల్స్ ఏడో జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. విద్యార్థులు, యువత ర్యాలీగా సాయికుల్వంతు హాల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిమీష్ పాండే ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సత్యసాయి స్కూళ్లను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సత్యసాయి భోదించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస పరమావధిగా విద్యాబోధన సాగాలన్నారు. విలువలతో కూడిన విద్యను నేర్చుకున్న యువత శాంతి మార్గంలో పయణిస్తూ ఇతరులకు స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

కేంద్ర సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా బీకే



పెనుకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన సంప్రదింపుల కమిటీలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని రహదారులు రవాణాశాఖలో సభ్యుడిగా నియమించారు. ఈ అవకాశం కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బీకే ధన్యవాదాలు తెలిపారు.

వాణిజ్య రవాణాకు కేంద్ర బిందువుగా మడకశిర

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వాణిజ్య రవాణాకు మడకశిర నియోజకవర్గం కేంద్ర బిందువుగా మారనుందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు తెలిపారు. పుట్టపర్తి నుంచి హిరియూరు వరకు జాతీయ రహదారి నిర్మించాలని కేంద్రానికి నివేదిక పంపడంతో సానుకూల సంకేతాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో శనివారం ఆయన మాజీఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర నియోజకవర్గం గుండుమల గ్రామంలో పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఇచ్చిన వినతులకు సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన తీసుకున్న చర్యల ఫలితంగానే పుట్టపర్తి మండలం జుగురాజుపల్లి నుంచి హిరియూరు జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ నిర్మాణ పనులు చేపట్టేందుకు నేషనల్ హైవే అథారిటీ వారు సర్వే నిర్వహించినట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ఇండియా మ్యాప్‌లో మడకశిరను గుర్తించేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పుట్టపర్తి నుంచి హిరియూరుకు అనుసంధానం చేసే జాతీయ రహదారికి ఐదు జాతీయ రహదారులు అనుసంధానం అవుతాయని మ్యాప్ ద్వారా వివరించారు. ఈజాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే మడకశిర రూపురేఖలు మారిపోతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, నాయకులు వి.ఎం.పాండురంగప్ప, దాసిరెడ్డి, మారుతీ, రామకృష్ణ తదితరులు ఉన్నారు.


జాతీయ రహదారి నిర్మాణ మ్యాప్‌ను చూపుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

ఇంకెప్పుడు ఇచ్చేది..?



జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం





పీఆర్‌లో వాహనాల అద్దె బిల్లుల పెండింగ్

జిల్లా వ్యాప్తంగా రూ.1.34 కోట్ల బకాయి

రెండేళ్లుగా రూపాయి కూడా చెల్లించని ప్రభుత్వం

13 మంది డీఈఈలు, ముగ్గురు ఈఈలకు తప్పని తిప్పలు

బిల్లుల రాక క్షేత్రస్థాయి పర్యటనలు అంతంతే..

కూటమి ప్రభుత్వంలోనైనా చెల్లించేరా..?

అనంతపురం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో వాహనాల అద్దె బకాయిలు కోట్లలో పేరుకుపోయాయి. గత రెండేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో పలువురు డీఈఈలు, ఈఈల క్షేత్రస్థాయి పర్యటనలు అంతంత మాత్రంగానే సాగిన పరిస్థితి. తద్వారా అభివృద్ధి పనులు కూడా ఆశించిన స్థాయిలో జరగలేదు. కొందరు అధికారులు ఫీల్డ్‌కు వెళ్లకుండానే ఫోన్‌ల ద్వారానే పని కానిచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరైతే కాంట్రాక్టర్ల ద్వారా డీజిల్ వేయించుకుని వెళ్లినట్లు తెలిసింది. ఇంకొందరు నిత్యం కార్యాలయంలోనే కూర్చొని బిల్లులు పెట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తే.. సదరు అధికారులు ఫీల్డ్‌కు వెళ్లి అభివృద్ధి పనులు వేగవంతం చేసే అవకాశం ఉందని ఆశాఖ వర్గాల్లో చర్చసాగుతోంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

పీఆర్ విభాగంలో డీఈఈలు	: 07
క్వాసీ విభాగంలో డీఈఈలు	: 02
పీఐయూ డీఈఈలు విభాగంలో	: 04
పీఆర్ఐ ఈఈ	: 01
క్వాసీ ఈఈ	: 01
పీఐయూ ఈఈ	: 01
మొత్తం డీఈఈలు, ఈఈలు కలిపి	: 16 మంది
వాహనాల పెండింగ్ బిల్లులు	: 1.34 కోట్లు

• రెండేళ్లుగా చెల్లించని బిల్లులు...

అభివృద్ధి పనులు పర్యవేక్షించడానికి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖలో పని చేస్తున్న ఈఈలు, డీఈఈలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం అద్దె వాహనాలు సమకూర్చింది. అయితే వాటికి నెలవారి అద్దె బిల్లుల చెల్లించలేదు. వాస్తవంగా ఉపాధి హామీ పథకం ద్వారా శాఖకు అడ్మిన్ కింద 3 శాతం నిధులు కేంద్రం ఇస్తుంది. వీటి నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి అద్దెవాహనాలకు బిల్లులు చెల్లించేవారు. అయితే ఆ నిధులను వైసీపీ సర్కార్ ఇతర పథకాలకు మళ్లించి, వాహనాలకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిందని ఆశాఖ వర్గాల సమాచారం.

జిల్లా వ్యాప్తంగా రూ.1.34 కోట్ల బకాయి

రాష్ట్ర వ్యాప్తంగా 2021 నవంబరు వరకు టీసీఎస్ సాఫ్ట్‌వేర్ కింద అధికారులకు ప్రతి మూడు నెలలకు అద్దె వాహనాల బిల్లులు ఎక్కడిక్కడ ఈఈ ల ద్వారా చెల్లించేవారు. అయితే కేంద్రం ఎస్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను అమలు చేయడంతో ఆశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీల ద్వారా ఆశాఖ ఈఎన్‌సీకి వచ్చి ఆ తర్వాత ఈఈల ద్వారా బిల్లులు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తరచూ బిల్లులు పెండింగ్‌లో పడ్డాయనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కేంద్రం మాత్రం ఎప్పటికప్పుడు ఉపాధి హామీ అడ్మిన్ కింద ఇచ్చే 3 శాతం ఆశాఖ ఉన్నతాధికారులకు మంజూరు చేస్తోందని తెలిసింది. అక్కడే వైసీపీ సర్కార్ అసలు కథ నడిపిందని ఆశాఖ వర్గాల సమాచారం. ఉన్నతాధికారుల నుంచి ఈఈలకు రాకుండా నిధులను వైసీపీ సర్కార్ ఇతర పథకాలకు మళ్లించి రెండేళ్లుగా వాహనాలకు అద్దె బిల్లులు మంజూరు చేయకుండా మొండికేసిందని ఆశాఖ వర్గాల సమాచారం. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ఈఈలు, డీఈఈల అద్దె వాహనాల బిల్లులకు సంబంధించి రూ.1.34 కోట్లు పెండింగ్‌లో ఉంచినట్లు తెలిసింది. ఈ బకాయిలను ప్రస్తుత కూటమి కూటమి ప్రభుత్వమైనా చెల్లిస్తుందా..? లేక అలాగే పెండింగ్‌లో పెడుతుందా...? అనే సందేహం అధికారుల్లో వ్యక్తం అవుతోంది. పల్లె పండుగలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 100 కోట్ల గ్రామీణ రోడ్ల పనులను వేగవంతంగా చేయాలంటే అధికారులు ఫీల్డ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించి సకాలంలో వాహనాల అద్దె చెల్లించడంతో పాటు పెండింగ్ బకాయిలను త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

పెండింగ్ వాస్తవమే




పంచాయతీ రాజ్‌శాఖలో అధికారులకు సంబంధించి అద్దె వాహనాల బిల్లుల పెండింగ్ ఉండటం వాస్తవమే. పీఆర్ఐ, క్వాసీ, పీఐయూ విభాగాల పరంగా ఒక్కొరకంగా పెండింగ్ ఉన్నాయి. ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే బిల్లులు వస్తాయని తెలిసింది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, జిల్లా పంచాయతీరాజ్‌శాఖ

దొరికినంత దోచెయ్..!

విడపనకల్లు సొసైటీలో తారస్థాయికి అవినీతి



విడపనకల్లు కో-ఆపరేటివ్ బ్యాంక్

4,863 ఎరువుల బస్తాలు పక్కదారి

రూ. 44.81లక్షలు స్వాహా

అవినీతి తేలినా చర్యలు శూన్యం

విడపనకల్లు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని విడపనకల్లు రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్)లో అవినీతి తారస్థాయికి చేరింది. ఈ ఎఫ్ఎస్‌సీఎస్‌కు ఎవరు అధ్యక్షులు అయినా దోపిడీ మాత్రం ఆగటంలేదు. 2015 నుంచి ఇప్పటి వరకూ సొసైటీ ద్వారా వచ్చిన 4863 బ్యాగుల ఎరువులను పక్కదారి పట్టించారు. తద్వారా రూ. 44.81లక్షలు దోచుకున్నట్లు జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి నిగ్గు తేల్చారు. ఈ డబ్బును రికవరీ చేయాలని ఆదేశించారు. మూడేళ్ల కిందట పాల్తూరు సొసైటీ గోడౌన్‌కు వచ్చిన దాదాపు 600బ్యాగుల ఎరువులు పక్కదారి పట్టాయని జిల్లా అధికారులు విచారణ జరిపి ఇద్దరు వ్యవసాయ అధికారులపై చర్యలు తీసుకున్నారు. 2018-19లో విడపనకల్లు గోడౌన్‌లో 1916 బస్తాల ఎరువులు లెక్కల్లో లేవు. 2021-22లో 2588 బస్తాల ఎరువులు లెక్కల్లో లేవు. పాల్తూరు గోడౌన్‌లో 2022-23లో 359 బస్తాల ఎరువులు కూడా అంతే. అక్రమాలు నిగ్గుతేల్చినా, పక్కదారి పట్టిన ఎరువులు, దానికి సంబంధించిన నగదును ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదు. దీంతో సొసైటీలో ఎవరికి దొరికింది వారు తింటున్నారనే ఆరోపణలు ఊపందుకున్నాయి. విడపనకల్లు గోడౌన్‌లో రూ. 27.33లక్షలు, బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడ గోడౌన్‌లో ఒకరి నుంచి రూ.13.13లక్షలు, మరొకరి నుంచి రూ. 1.95 లక్షలు, వజ్రకరూరు మండలంలోని చాబాల గోడౌన్‌లో రూ.2.39లక్షలు రికవరీ చేయాలని కో-ఆప్‌రేటివ్ ఆడిట్ అధికారి పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఏ ఒక్కరికి కనీసం నోటీసు కూడా జారీ చేయలేదు.


ఆడిట్ రిపోర్టులో రూ.44.81లక్షలు రికవరీకి ఆదేశించి దృశ్యం



రూ. 17లక్షలకు కొన్నట్లు ఉన్న రిజిస్ట్రేషన్ పత్రం


రిజిస్ట్రేషన్ చేయించుకున్న మాజీ సీఈఓ రహంతుల్లా

రూ. 4లక్షలు విలువ చేయని ఇంటికి రూ. 17లక్షలు ఇచ్చినట్లు రిజిస్ట్రేషన్

విడపనకల్లు కో-ఆపరేటివ్ బ్యాంక్ సహకారంతో బొమ్మనహాళ్ మండలంలోని గోవిందవాడలో గోడౌన్ నిర్వహించేందుకు 2016లో కాశంసెట్టి వెంకటలక్ష్మమ్మ ఇంటిని కొనుగోలు చేశారు. అప్పటి సీఈఓ షేక్ రహంతుల్లా పేరున అనంతపురంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. కనీసం రూ. 4లక్షలు కూడా చేయని ఆ ఇంటికి రూ. 17లక్షలు చెల్లించినట్లు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇక్కడా దాదాపుగా రూ. 13లక్షలు స్వాహా చేశారు. కాశంసెట్టి వెంకటలక్ష్మమ్మను విచారించగా తనకు రూ. 4లక్షలు మాత్రమే ఇచ్చారని తెలిపింది.

పెద్ద కొట్టాపల్లి సొసైటీలో రూ.50లక్షలు పక్కదారి

మండలంలోని పెద్ద కొట్టాల పల్లి సొసైటీలోను రూ. 50లక్షలు పక్కదారి పట్టినట్లు చర్చలు జరుగుతున్నాయి. 2019-20లో అప్పటి సొసైటీ అధ్యక్షుడు వేరుశనగ, ఎరువులు విక్రయాల్లో అవినీతికి పాల్పడి మార్కుఫెడ్ కంపెనీకి దాదాపుగా రూ. 50లక్షలు బకాయి ఉన్నట్లు తెలిసింది. రైతు సేవా సహకార సంఘం పేరుతో లక్షల్లో దోచుకుతింటున్నట్లు ప్రచారం సాగుతోంది.

చెరువుల మరమ్మతుకు నిధులు ఇవ్వాలి

చర్చావేదికలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువుల మరమ్మతులకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. జిల్లా సాగునీటి వనరుల పరిస్థితులపై సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్రలో రైతులు వివరించిన సమస్యలపై శనివారం జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో మేధావులతో చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గేయానంద్ మాట్లాడుతూ జిల్లాలో కనీస వ్యవసాయం సాగు కావాలంటే 30శాతం భూమికి సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లోనే సూచించిందన్నారు. విభజన తర్వాత అనంతపురం జిల్లాలో నికరంగా 14.85లక్షల ఎకరాల సాగుభూమి ఉందన్నారు. ఇందులో స్థిరీకరించబడిన ఆయకట్టు 45,224ఎకరాలు, అంటే మొత్తం సాగుభూమిలో కేవలం 3.04శాతం భూమికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉందన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు సంవత్సరంలోపు పూర్తి చేయాలని, తుంగభద్ర డ్యామ్‌కు కొత్తగేట్లను అమర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరపాలని కోరారు. ఈనెలాఖరులో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి, బడ్జెట్ ప్రతిపాదనల్లో జిల్లా సాగునీటి వనరులకోసం నిధులు కేటాయించాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎం బాషా, మానవహక్కుల వేదిక చంద్రశేఖర్, సత్యబోస్, భానుజా, వీకే రంగారెడ్డి, లాయర్ అబ్దుల్ రసూల్, తరిమెల అమర్నాథరెడ్డి, గోవిందరాజులు, భోగేశ్వరరెడ్డి, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రామిరెడ్డి, ఆర్‌వి నాయుడు, నాగమణి, చంద్రిక, రాయుడు పాల్గొన్నారు.


చర్చావేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

రేపు గుంతకల్లులో ప్రజాఫిర్యాదుల వేదిక

అనంతపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని వచ్చే సోమవారం 28న గుంతకల్లు నిర్వహిస్తామని కలెక్టరు వినోద్‌కుమార్ ఓప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజనల్(ఆర్డీఓ)ఆఫీస్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఆరోజు తనతో పాటు జేసీ, ఇతరశాఖల ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ అందిస్తామని ఆ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి, 18-28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ వంటి అంశాల గురించి 35రోజుల పాటు బెంగళూరులో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. శిక్షణా కాలంలో భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు. ఉద్యోగానికి ఎంపికైన తరువాత నెలకు రూ.15వేలకు పైగా వేతనం చెల్లిస్తారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9000487423ను సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి 'పది' ఫీజు చెల్లింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి చదివే విద్యార్థులు మార్చి/ఏప్రిల్‌లో జరిగే పరీక్షల ఫీజును ఈ నెల 28వ తేదీ నుంచి చెల్లించాలని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్‌నాయక్, సత్యసాయి జిల్లా డీఈఓ జి.కిష్టప్ప శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకూ ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చన్నారు. రూ. 50 ఫైన్‌తో నవంబర్ 12 నుంచి 18వ తేదీ వరకూ, రూ. 200 ఫైన్‌తో వచ్చే నెల 19 నుంచి 25 వరకూ, రూ. 500 ఫైన్‌తో అదే నెల 26 నుంచి 30వ తేదీ వరకూ ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ. 125, ఇతరులు మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులున్న విద్యార్థులు రూ. 125, మూడుకంటే తక్కువ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు రూ. 110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతోపాటు అదనంగా రూ. 60 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ కోసం రూ. 80, తక్కువ వయస్సున్న విద్యార్థులు రూ. 300 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పనుల్లో వేగం పెంచండి

పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం

అనంతపురం సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు పనుల్లో మరింత వేగం పెంచాలని ఉమ్మడి జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన స్థానిక ఎస్ఈ కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీఐయూ విభాగాల అధికారులు, ఉద్యోగులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా జిల్లాల వారిగా పనులకు సంబంధించిన పలు అంశాలపై ఆరా తీశారు. త్వరలో ఉన్నతాధికారులతో పూర్తిస్థాయి సమీక్ష ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన సమగ్ర వివరాలు, రికార్డులతో పక్కాగా ఉండాలని సూచించారు. ఎక్కడా పనులు ఆగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఈఈలు కేవీకేవీ ప్రసాద్, డీఎల్ శ్రీనివాస్, పలువురు డీఈఈలు, జేఈలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టుల కోసం పైరవీలు

31న ఆర్‌అండ్‌బీ ఎస్ఈ, పీఆర్ ఈఈ ఉద్యోగ విరమణ

ఎస్ఈగా కర్నూలు నుంచి వచ్చే అవకాశం

పీఆర్ ఈఈ కోసం జోరుగా సిఫార్సులు

ఇప్పటికే ఉన్నతాధికారుల వద్దకు ఫైల్స్

అనంతపురం సిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) ఈఈ, రోడ్లు భవనాలు (ఆర్‌అండ్‌బీ) శాఖ ఎస్ఈ ఈనెల 31వ తేదీన పదవీ విరమణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా స్థానాలకు ఎక్కడి నుంచి ఏ అధికారో వస్తారో.. అని ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చసాగుతోంది. కొందరు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఇప్పటికే తమ ఫైల్స్‌ను ఆయా శాఖల ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిసింది. రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని పీఐయూ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కేవీకేవీ ప్రసాద్ ఈనెల 31న పదవీ విరమణ చేస్తున్నారు. చాలా మంది అధికారులు ఆయా పోస్టుల కోసం చేస్తున్న సిఫార్సులు, పైరవీలు ఓ స్థాయిలో ఉన్నాయనే చర్చ జరుగుతోంది.

ఆర్‌అండ్‌బీలో ఎవరికి వారే..

ఆర్‌అండ్‌బీ ఎస్ఈ పోస్టు కోసం అర్హులైన అధికారులు ఎవరి స్థాయిలో వారు విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కర్నూలు జిల్లాలో పనిచేస్తున్న సురేష్‌బాబు, తిరుపతిలో పనిచేస్తున్న మధుసూదన్‌రావు, నెల్లూరులో పనిచేస్తున్న స్టాండ్‌లీజోన్స్‌తో పాటు కోస్తాలో ఇద్దరు ఈఈలు ఎస్ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడి ఆర్‌అండ్‌బీ ఎస్ఈ పోస్టుతో పాటు కడప క్వాలిటీ కంట్రోల్, చిత్తూరు ఎస్ఈ పోస్టులు కూడా ఖాళీగా ఉండటంతో ఈ ఆరుగురిలో ఏ అధికారికి ఎక్కడికి పోస్టింగ్ ఇస్తారోనని ఉత్కంఠ రేపుతోంది. అనంతపురం ఆర్‌అండ్‌బీ ఎస్ఈగా కర్నూలులో పనిచేస్తున్న సురేష్‌బాబుకు, చిత్తూరుకు స్టాండ్‌లీ జోన్స్, కడప క్వాలిటీ కంట్రోల్‌కు మధుసూదన్‌రావును నియమించే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ పదోన్నతి ప్రక్రియ ఆలస్యమైతే ఇక్కడే ఎన్‌హెచ్ ఎస్ఈగా పనిచేస్తున్న హరిప్రసాద్‌కు ఇన్‌చార్జి ఎస్ఈగా నియమించే అవకాశం కూడా లేకపోలేదు.


పీఐయూ ఈఈ కేవీకేవీప్రసాద్


ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబుల్‌రెడ్డి


ఈఈ శంకరయ్య


ఈఈ చంద్రశేఖర్


పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈ జహీర్ అస్లాం


ప్రస్తుత ఈఈ ప్రభాకర్‌రెడ్డి


ఎన్‌హెచ్ ఎస్ఈ హరిప్రసాద్

పీఆర్ ఈఈ కోసం సిఫార్సులు

పంచాయతీ రాజ్‌శాఖలో పీఐయూ విభాగం కీలకమైంది. ఇక్కడ రూ. కోట్లలో పనులు జరుగుతుంటాయి. ఇక్కడి ఈఈ కూడా ఈనెల 31న పదవీ విరమణ పొందుతున్నారు. సదరు పోస్టుపై పలువురు అధికారులే ప్రజా ప్రతినిధులు, బడా కాంట్రాక్టర్ల సిఫార్సులతో పోస్టింగ్ కోసం పెద్దఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్నారని తెలిసింది. సదరు శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో ఆశించిన ప్రాంతాల్లో పోస్టింగ్ లభించక నిరాశ చెందిన ఇద్దరు అధికారులు కూడా ఈ పోస్టు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... ప్రస్తుతం ఫారెన్ సర్వీస్‌లో ఇతర శాఖలో పనిచేస్తున్న ఈఈ శంకరయ్య, అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేసిన చంద్రశేఖర్ ఈ పోస్టు కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారని సమాచారం. అనంతపురం డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డికానీ, ఆ శాఖ ఎస్ఈ జహీర్‌అస్లాంకు కానీ.. ఇన్‌చార్జి ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. అలా కాకపోతే.. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు ఈఈల్లో ఒకరిని ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ప్రధానంగా శంకరయ్య, చంద్రశేఖర్‌లలో ఒకరిని నియమించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

ప్రైవేటు ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

డాక్టర్ల వివరాలు ప్రదర్శించాలి

ఆరోగ్యవంతమైన జిల్లాగా మారుద్దాం

వైద్యశాఖ సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖాధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ రిజిస్ట్రేషన్ కాపీతో పాటు అక్కడ పని చేస్తున్న డాక్టర్లు, వారు చదివిన సర్టిఫికెట్లు, ఎన్ని గదులు, ఎన్ని పడకలు, వాష్‌రూమ్స్ తదితర వివరాలు మొత్తం ఆవరణంలోని డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాలన్నారు. జిల్లాలో 528 ఆసుపత్రులు ఉన్నాయని, వీటి వివరాలు పూర్తిగా తెలియజేసే విధంగా ఎక్సెల్ షీట్‌లో నమోదు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు కూడా సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఐఎంఏ, ఆప్నా, ప్రైవేట్ ఆసుపత్రుల అసోషియేషన్లు జిల్లాలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకొని మహిళలు, చిన్నపిల్లలకు అవసరమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు సమష్టిగా పని చేసి అనంతను ఆరోగ్యవంతమైన జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, ఐఎంఏ అధ్యక్షుడు మురళీక్రిష్ణ, ఆప్నా అధ్యక్షుడు విజయకుమార్, థామస్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఆర్డీటీ హెల్త్ డైరెక్టర్ రవిప్రసాద్‌రావు, డెమోలు త్యాగరాజు, గంగాధర్, పలువురు వైద్యాధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయండి

ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ ఆనంద్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ప్రణాళిక తయారు చేయాలని అటవీ శాఖ సిబ్బందిని ఇన్‌చార్జి డీఎఫ్ఓ ఆనంద్ ఆదేశించారు. అటవీశాఖ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నదానిపై శనివారం అటవీశాఖ కార్యాలయంలోని డీఎఫ్ఓ చాంబర్‌లో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీశాఖకు నిధుల కేటాయించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. నర్సరీల అభివృద్ధికి ఎలాంటి మొక్కలు అందుబాటులో ఉంచాలి? ఎలాంటి ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి? వణ్యప్రాణుల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. రేంజర్లు శ్రీనివాసులు, మధుబాబు, సెక్షన్ ఆఫీసర్లు నారపరెడ్డి, ప్రవీణ్‌కుమార్, అక్బర్ పాల్గొన్నారు.

పింఛన్ పత్రాలకు

ప్రత్యేక కౌంటర్లు

• మంగళ, శుక్రవారాల్లోనే వైద్య పరీక్షలు • సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు


హెచ్‌ఓడీలతో సమీక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ పత్రాల కోసం వచ్చే వారికి జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వైద్యాధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పరీక్షల కోసం ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున వస్తుండడంతో ఎలాంటి చర్యలు తీసుకుందామని ఆర్ఎంఓలు, హెచ్ఓడీలతో చర్చించారు. ఈ తాకిడిని నిలువరించడం కోసం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మంగళ, శుక్రవారాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆ రోజుల్లో ముందుగా తెలిపిన మేరకు పేషెంట్లు రావచ్చని, ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకుంటామన్నారు. 2 గంటల నుంచి 4 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న పేషెంట్లకు సంబంధిత డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆసుపత్రి ఆవరణంలో ఉన్న డీఈఐసీ సెంటర్, బర్న్‌వార్డు, సాధారణ ఓపీ కేంద్రాలలో కౌంటర్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. సమావేశంలో ఆర్ఎంఓ హేమలత, హెచ్ఓడీలు బీమసేనాచారి, భాస్కర్, ఆత్మారామ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌కుమార్



అనంతపురం నగరంలోని బ్రాహ్మణ వీధికి చెందిన గంగాధర్ కుమారుడు. చిన్నప్పటి నుంచి ఇస్కాన్ ఆలయానికి వెళ్లేవాడు. స్వామి సేవలో తరించేవాడు. నాలుగేళ్ల క్రితం వివాహమైంది. రెండేళ్ల కుమార్తె ఉంది. గంగాధర్‌కు ముగ్గురు సంతానం కాగా.. సంతోష్ ఒక్కడే కుమారుడు. చిన్నప్పటి నుంచి స్వామి సేవ చేస్తున్న ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

వెంకటేశ్



అనంతపురం కమలా నగర్‌కు చెందిన కిరాణా వ్యాపారి శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు. ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. పన్నెండేళ్లుగా ఇస్కాన్ నిర్వహించే సంకీర్తనల్లో పాల్గొంటున్నాడు.

లక్ష్మీ ప్రసన్నకుమార్ రెడ్డి



అనంతపురం రూరల్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన శివశంకర్‌రెడ్డి, కృష్ణవేణి దంపతుల కుమారుడు. బీటెక్ పూర్తి చేశాడు. 15 సంవత్సరాలుగా ఇస్కాన్ ఆలయంలో స్వామి వారికి సేవ చేస్తున్నాడు. ప్రమాదానికి గురైన కారును తానే నడిపాడు.

కర్ణ ప్రణీత్ ప్రణవ సాయిరెడ్డి



అనంతపురం పాతూరులోని భాగ్యనగర్ చెందిన పెద్దారెడ్డి, చంద్రలేఖ దంపతుల కుమారుడు. హైదరాబాద్‌లోని స్వామి నారాయణ ఆలయం అనుబంధ విద్యా సంస్థలో 8వ తరగతి చదువుతున్నాడు. వారం రోజులు సెలవులు ఇవ్వడంతో ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు ఇస్కాన్ భక్తులు కావడంతో ఇతర భక్తులతోపాటు తన కుమారుడిని తాడిపత్రిలో జరిగిన సంకీర్తన కార్యక్రమానికి పంపారు.

శ్రీనివాసులు



శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్‌చెరువు గ్రామానికి చెందిన అయ్యప్ప, కొండమ్మ దంపతుల ఏకైక కుమారుడు. డిగ్రీ వరకు చదివాడు. ఆరేళ్ల క్రితం దివ్య అనే మహిళతో వివాహమైంది. వీరికి ఐదు సంవత్సరాల కుమారుడు కృష్ణ ఉన్నాడు. శ్రీనివాసులు, ఆయన భార్య దివ్య, కుమారుడితో కలిసి అనంతపురం హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు.కలెక్టరేట్ సమీపంలోని ఇస్కాన్ గోశాల ఆవరణలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా కొనసాగుతున్నాడు. 14 సంవత్సరాలుగా ఇస్కాన్‌లో సేవలు అందిస్తున్నాడు. సీఎం చంద్రబాబునాయుడు 2014 ఎన్నికలకు ముందు 'వస్తున్నా మీ కోసం' పాదయాత్రలో భాగంగా ఇస్కాన్ ఆలయాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఆలయంలో పూజారిగా ఉన్న శ్రీనివాసులు.. ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి హారతిని చంద్రబాబుకు అందించారు.

షణ్ముగ్



శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహాడపల్లికి చెందిన సాంబమూర్తి, సుజాత దంపతుల కుమారుడు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూనే.. కియ కార్ల తయారీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అనంతపురం సాయినగర్‌లో ఉంటున్నాడు. మూడేళ్లుగా ఇస్కాన్ ఆలయ భక్త బృందంలో సభ్యుడిగా ఉంటూ సంకీర్తనలలో పాల్గొంటున్నాడు.

నా స్వామి రాత్రికి వస్తాడు..



రోడ్డు ప్రమాదం శ్రీధర్ ప్రభు(శ్రీనివాసులు) మృతి చెందడంతో ఆయన భార్య దివ్య ప్రమాద స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి కుప్పకూలిపోయారు. 'అన్నా.. నా స్వామి రాత్రికి వస్తాడు. చనిపోలేదు. ఎక్కడికీ పోలేదు' అని దివ్య రోదించడం అక్కడి వారిని కలిచివేసింది. 'రాత్రికల్లా ఇంటికి వస్తానని ఫోన్ చేశాడు.. ఇప్పుడు ఇలా అయిపోయాడు..' అని తన బంధువులతో చెప్పుకుంటూ విలపించారు. ఆమెను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు.

సార్.. నా బిడ్డ కళ్లను దానం చేయండి

ప్రమాద స్థలానికి చేరుకున్న ప్రణవ్ సాయిరెడ్డి తల్లి చంద్రలేఖ కన్నీరుమున్నీరయ్యారు. 'మా కుటుంబం అంతా స్వామి భక్తిలోనే ఉన్నాం. ఆ భక్తితోనే నా బిడ్డను సంకీర్తనకు పంపాము. ఇప్పుడు నా బిడ్డ లోకం వదిలి వెళ్లిపోయాడు..' అని ఆమె బోరున విలపించారు. 'నా బిడ్డకు అప్పుడే నూరేళ్లునిండిపోయాయి సార్.. నా బిడ్డను వెంటనే ఆసుప్రతి తీసుకువెళ్లండి. నా బిడ్డ కళ్లను దానం చేయండి' అని అక్కడున్న పోలీసులను వేడుకుంది. ఆమె వేదనను చూసిన పోలీసులు, అక్కడి ప్రజలు చలించిపోయారు.



పెళ్లికి వెళ్లుంటే బతికేవాడివేమో..

'బంధువుల పెళ్లికి పొమ్మంటే స్వామి పూజకు వెళ్లి పరలోకానికి పోతివా నాన్నా..' అంటూ లక్ష్మీప్రసన్న కూమార్ రెడ్డి తల్లిదండ్రులు శివశంకర్‌రెడ్డి, కృష్ణవేణి గుండెలు బాదుకున్నారు. పెళ్లికి పోయుంటే బతికేవాడివేమో కదా నాన్నా.. అని తమ ముద్దుల కొడుకు మృతదేహం వద్ద విలపించారు. తెల్లవారుజామునే బయటకొచ్చి.. ఇలా మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా.. అంటూ గుండెలు బాదుకున్నారు.

రోడ్డు ప్రమాదంపై ఎంపీ బీకే దిగ్భ్రాంతి

పెనుకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో ఇస్కాన్‌కు చెందిన ఆరుగురు మృతిచెందడం బాధాకరమని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఓ ప్రకటనలో తెలిపారు. దైవ సంకీర్తనకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరగడం చాలా బాధాకరమన్నారు. మృతుల బంధువులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అత్యంత బాధాకరం: సవిత

రోడ్డు ప్రమాదంలో ఇస్కాన్ సేవకుల మృతి అత్యంత బాధాకరమని మంత్రి సవిత విచారం వ్యక్తం చేశారు. ఆరుగురి మృతి దిగ్భ్రాంతి కలిగించిందని అన్నారు. వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఆమె అన్నారు.







మృతులను చూసి విలపిస్తున్న బంధువులు

పరంధామా..



ఇంత ఘోరమా..!

- గుండె పగిలిన శ్రీకృష్ణ భక్తులు
- ఆరుగురిని మింగిన ప్రమాదం
- నాయనపల్లి క్రాస్ వద్ద ఘోరం
- టైరు పేలి.. లారీని ఢీకొన్న కారు

శింగనమల/అనంతపురం కల్చరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నాయనపల్లి క్రాస్‌లో జరిగిన ప్రమాదాన్ని కళ్లారా చూసిన స్థానికులు తీవ్ర ఆవేదన చెందారు. 'కారు టైర్ బరెస్ట్ కావడంతో ఎదురుగా వస్తున్న లారీని ఒక్కసారిగా కారు ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జుగా మారింది. దాదాపు 20 మీటర్ల దూరం కారును లారీ లాక్కువెళ్లింది. దీంతో కారులో ఉన్న ఏ ఒక్కరూ ప్రాణాలతో మిగల్లేదు..' అని ఆవేదన వ్యక్తం చేశారు. లారీని కారు ఢీకొట్టిన సమయంలో హఠాత్తుగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. క్షణాల్లో తేరుకుని పరుగులన అక్కడికి చేరుకున్నారు. కారులోని వారిని బయటకు లాగే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కారులో లారీ నుంచి వేరుగా లాగారు. మృతదేహాలను బయటకు తీసేందుకు గంట సమయం పట్టింది. కారు డ్రైవర్ లక్ష్మీప్రసన్నకుమార్‌రెడ్డి మృతదేహాన్ని బయటకు తీసేందుకు చాలా కష్టపడ్డారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీఐజీ

నాయనపల్లి క్రాస్‌లో ప్రమాద స్థలాన్ని డీఐజీ షిమోషి, అడిషినల్ ఎస్పీ రమణమూర్తి, డీఎస్పీ వెంకటేశులు పరిశీలించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్నారు.







ఆసుపత్రి వద్ద మిన్నంటిన రోదనలు



ఆసుపత్రిలో మృతులను చూసి విలపిస్తున్న దృశ్యం



ఆసుపత్రి వద్ద గుమిగూడిన మృతుల బంధువులు

కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరి మృతి

గుత్తి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో కర్ణాటక బస్సు ఢీకొని శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. బస్సు గుత్తి నుంచి బెంగళూరుకు బయల్దేరింది. అనంతపురం రోడ్డులోని మాతృశ్రీ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వయస్సు 55 సంవత్సరాలు ఉండవచ్చునని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహంపై నీలం కలర్ ఫుల్ డ్రాయర్ మాత్రమే ఉందన్నారు. మృతుడు పట్టణంలో భిక్షాటన చేస్తూ ఉండేవాడన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో నలుగురి అరెస్టు



అరెస్టయిన వారిని చూపుతున్న సీఐ

తాడిపత్రి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం గంజాయిను సేవిస్తున్న అజయ్, దీపక్, నాగేంద్రతో పాటు విక్రేత మహమ్మద్‌షరీఫ్‌ను అరెస్ట్‌చేసి వారివద్ద నుంచి 243గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన మహమ్మద్‌షరీఫ్ బళ్లారి నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయించేవాడన్నారు. దీంతో ఫ్లైఓవర్ వద్ద గంజాయిని విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో దాడులు చేసి నలుగురిని అరెస్టు చేశామన్నారు. వీరిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

అధిక మోతాదులో మందులు తీసుకుని యువకుడి మృతి



శాంతరాజ్ (ఫైల్)

కుందుర్పి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్యులు సూచించిన మందుల కన్నా అధికంగా వాడి శాంతరాజ్ (35) అనే యువకుడు శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శాంతరాజ్ గుండె సంబంధిత వ్యాధితో అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్నాడు. అనంతరం ఇంటికి చేరాడు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో బెంగళూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. పరీక్షించిన అనంతరం వైద్యులు మందులు ఇచ్చారు. వాటిని తీసుకోవాల్సిన మేరకు కాకుండా అధికంగా తీసుకోవడంతో వారం రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కుందుర్పి పోలీస్ స్టేషన్లో మృతుడి అన్న అనిల్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం దుండగులు తవ్వకాలు చేయడం పట్టణంలో కలకలం రేపుతోంది. పట్టణంలోని కురాకులతోటకు వెళ్లే దారిలోని పొలంలో క్షుద్రపూజలు చేసి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. శనివారం యర్రిస్వామి అనే రైతు పొలం పరిశీలించడానికి వెళ్లిన సందర్భంలో దాదాపు ఆరడుగుల లోతు తవ్వి చుట్టూ పూజలు చేసిన దృశ్యం చూసి అవ్వాక్కయ్యారు. పెద్ద బండలను సైతం తొలగించినట్లు ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వెంటనే పొలం యజమాని పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి ఉపాధ్యాయుడి మృతి



గోవిందరాజులు (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి గోవిందరాజులు (50) అనే ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాసరి గోవిందరాజులు అనే ఉపాధ్యాయుడు ఇంటి నుంచి శుక్రవారం శివాలయం దగ్గర ధ్యానం చేయడానికి వెళుతున్నానని చెప్పి వెళ్లారు. రాత్రి వరకు గోవిందరాజులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించగా బావిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య వెంకటరమణమ్మ, కుమారుడు వినయ్‌కుమార్, కుమార్తె జయకీర్తన వున్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌బాక్స్

రైతు సేవా సిబ్బంది క్రమబద్ధీకరణకు శ్రీకారం

అనంతపురం అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని రైతు సేవా కేంద్రం సిబ్బందితో పాటు ఎంపీఈఓలు, ఏఈఓలను క్రమబద్ధీకరణ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 29వతేదీ వీటికి సంబంధించి పూర్తి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ ఎంపీఈఓలకు క్రమబద్ధీరణలోనే తిరిగి జిల్లాలో పోస్టింగులు ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పత్తి రైతులు నమోదు చేసుకోండి

అనంతపురం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 1 తరువాత పత్తి కొనుగోలు చేస్తామని, రైతులు పంట నమోదు చేసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7121 నుంచి రూ.7521 తో కొనుగోలు చేస్తామన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. నవంబరు 1 తరువాత శాంపిల్స్‌ను గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో కాటన్ కార్పొరేషన్ వారికి చూపించి మద్దతు ధరకు అమ్ముకోవచ్చన్నారు. 8 నుంచి 12 శాతం వరకు మాత్రమే తేమ ఉండాలన్నారు. తడిచిన, రంగు మారిన పత్తిని తీసుకురాకూడదన్నారు.

పోటా పోటీగా ఫుట్‌బాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అండర్ -14 బాల, బాలికల ఫుట్‌బాల్ క్రీడలు శనివారం రెండో రోజు పోటాపోటీగా సాగాయి. బాలుర విభాగంలో అనంతపురం, విశాఖ జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. ఈ రెండు జట్ల మధ్య ఆదివారం ఉదయం జరిగే పోటీలో గెలిచినవారు ఫైనల్‌కు వెళ్తారు. మరో పూల్‌లో శ్రీకాకుళం జట్టు ఫైనల్‌కు చేరుకుంది. బాలికల విభాగం సెమీస్‌లో చిత్తూరు జట్టుపై గెలిచిన అనంతపురం ఫైనల్‌కు చేరుకుంది. మరో పూల్‌లో ఆదివారం ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి తలపడనున్నాయి. గెలుపొందిన వారు ఫైనల్‌కు చేరుకుంటారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ఒకరి మృతి, 15 మందికి తీవ్ర గాయాలు
- వేములపాడు హైవేపై సంఘటన
- బాధితులంతా కొట్టాలపల్లికి చెందిన కూలీలే



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

యాడికి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వేములపాడు వద్ద జాతీయ రహదారిపై శనివారం కారు- ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఆటో డ్రైవర్ సహా 15మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు కొట్టాలపల్లి గ్రామానికి చెందిన 15మంది కూలీలు తమ గ్రామానికే చెందిన ఆటోను బాడుగకు తీసుకొని తాడిపత్రి మండలంలోని బందార్లపల్లి గ్రామంలో వేరుశనగ పంట కోత పనికి వెళ్లారు. పని ముగిసిన తర్వాత సొంతూరికి ఆటోలో బయలుదేరారు. వేములపాడు గ్రామ సమీపం వద్దకు రాగానే గుంతకల్లు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న కారు ఎదురుగా వచ్చి వేగంగా ఢీకొంది. దీంతో కూలీలు ఆటోలో నుంచి ఎగిరి కిందపడ్డారు. ఆటోడ్రైవర్ శివతోపాటు 15మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో చిన్నరంగారెడ్డి, నబీరసూల్, ప్రతాప్, కుళ్లాయప్ప, కుళ్లాయమ్మ, కాశింబీ, దస్తగిరమ్మ, ప్రతాప్, సుబ్బమ్మ, రమణమ్మ, రంగమ్మ, రామచంద్రుడు, లక్ష్మి, కళావతి మరో ఇద్దరు ఉన్నారు. బాధితులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దస్తగిరమ్మ (50)ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈమెకు భర్త షెక్షావలి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కొట్టాలపల్లి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి తరలివచ్చారు. పోలీసులు సంఘటనా ప్రదేశానికి వచ్చి ప్రమాదంపై వివరాలు ఆరాతీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. కాగా రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వారిని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు.



దస్తగిరమ్మ(ఫైల్)

పోస్టుమ్యాన్ ఆత్మహత్య



ఆంజనేయులు నాయక్

సోమందేపల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగినాయనిచెరువు తండాకు చెందిన పోస్టుమ్యాన్ ఆంజనేయులునాయక్ (48)ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. ఎస్ఐ రమేష్ తెలిపిన మేరకు ఆంజనేయులునాయక్ సోమందేపల్లి గాంధీనగర్‌లో నివాసముంటున్నాడు. భార్య సాకీబాయ్ నర్సుగా పని చేస్తున్నారు. సుద్దకుంటపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు నాయక్ విధులకు వెళ్తున్నట్లు భార్యకు చెప్పి శుక్రవారం బయటకు వచ్చాడు. ఆ సమయంలో సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలేశాడు. నక్కలగుట్ట సమీపంలో ఓ వ్యక్తి స్పృహకోల్పోయి పడి ఉన్నాడన్న స్థానికుల సమాచారంతో ఎస్ఐ తన బృందంతో అక్కడికి చేరుకున్నారు. పరిసరాలను గమనించిన ఎస్ఐ పంట పొలాలకు వాడే క్రిమిసంహారకమందును తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందజేయడంతో వారు ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. భార్య సాకీబాయి మాట్లాడుతూ శుక్రవారం విధులకు వెళ్లిన భర్త ఆంజనేయులు రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులతో కలిసి గాలించామని తెలిపింది. ఆచూకి తెలియలేదన్నారు. శనివారం నక్కలగుట్ట వద్ద శవమై కనిపించాడని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇంజనీరింగ్ చదువుతున్న ఒక కుమారుడు ఉన్నాడు.

న్యూస్ బాక్స్

10న వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తొలి స్వాతంత్ర సమర యోధుడు వడ్డె ఓబన్న విగ్రహాన్ని కదిరిలో వచ్చే నెల 10న ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి.. ఆయన నివాసంలో ఆవిష్కరించిన వారు మాట్లాడారు. సమాజం కోసం ప్రాణాలు లెక్కచేయని ఆయన వ్యక్తిత్వం యువతకు ఆదర్శమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వడ్డెర్లు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి ప్రభుత్వం పరంగా అన్నిరకాల సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు డాబా గంగయ్య, సైదాపురం రమణ, నరసింహులు, చల్లా చంద్రశేఖర్, వెంకటరమణ, నారాయణ, పెద్ద వేమయ్య పాల్గొన్నారు.

కూటమి హామీలను అమలు చేయాలి



జెండా ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

ధర్మవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, దిల్షాద్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ మహాసభను శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోవాలన్నారు. రూ.99 లకే మంచి మద్యం ఇస్తామని చెప్పి... పాత బ్రాండ్లనే అంటగడుతున్నారన్నారు. రాబోవు కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, పట్టణ కార్యదర్శి మారుతి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు నాగార్జున పాల్గొన్నారు.

శనగల లారీ బోల్తా



బోల్తాపడిన శనగల లారీ

తాడిమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏకపాదంపల్లి బస్టాప్ వద్ద శనగల లారీ బోల్తాపడింది. శనివారం ఉదయం తాడిపత్రి వైపు నుంచి ధర్మవరం వైపు ఈ లారీ వెళ్తుండగా.. రోడ్డుపై గుంతను తప్పించబోయి లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ చేయి విరిగింది. ఈ ప్రాంతంలో రోడ్డు బాగలేదని, దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అయినా అధికారులు, పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఓ

నంబులపూలకుంట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై మండలంలోని వెలిచెలమల రైతు సేవా కేంద్రంలో ఏడీఏ సత్యనారాయణ ఎన్పీకుంట, గాండ్లపెంట మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి శనివారం అవగాహన కల్పించారు. దరఖాస్తు చేసుకుంటే 30 రోజులలోపు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యాలయ ఆవరణంలో తప్పకుండా సమాచారం హక్కు బోర్డు ఏర్పాటు చేయాలని, అందులో సమాచార అధికారి, సహాయ సంచార అధికారి పేర్లతో పాటు ఫోన్ నెంబర్లు పొందుపరచాలని సూచించారు. సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకుంటే బాధిత ఉద్యోగికి జరిమానా, క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు లోకేశ్వర్‌రెడ్డి, లక్ష్మీప్రియ, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న కమిషనర్

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. ఇందిరమ్మకాలనీలో శనివారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్, హెచ్ఎంలు కుళ్లాయప్ప, ముస్తాక్ అహమ్మద్, డీసీవీసీ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడ్డి, అధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, సెక్రటరీ జాబీవుల్లా, జాయింట్ సెక్రటరీ ఉదయ్, కోశాధికారి ఓంప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అలాగే పోలీసుల పిల్లలకు పర్యావరణ పరిరక్షణలో పోలీసుల యొక్క చర్యలు, సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర, అనే అంశాలపై వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వీటిని జిల్లా అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు పర్యవేక్షించారు.

గజానికో గుంత..

ఎన్నాళ్లో ఈ చింత..!

- శిథిలావస్థలో గ్రామీణ రహదారులు
- వర్షాలకు మరింత ఘోరంగా తయారైన వైనం
- వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పలు గ్రామాలకు బస్సులు రద్దు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



చౌటకుంటపల్లి - దొన్నికోట రహదారి



నల్లమాడ - చెరువువాండ్లపల్లి రహదారి

గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రహదారులు ఘోరంగా తయారయ్యాయి. ఇక గ్రామీణ రహదారుల పరిస్థితి చెప్పనక్కర లేదు. ప్రస్తుతం వారం పాటు వర్షాలు కురుస్తుండటంతో వాటి పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. రోడ్లు బాగలేకపోవడంతో పలు గ్రామాలకు ఆర్టీసీ అధికారులు బస్సులను కూడా బంద్ చేశారు. బైక్‌పై కిలోమీటర్ వెళ్లాలంటే.. అర గంట పడుతోంది. మొత్తం... బురద.. గుంతలే. పనులు మానకోలేక... ఈ రోడ్లపై ప్రయాణం చేయలేక గ్రామీణులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎన్నికల సమయంలో తప్పా రాజకీయ నాయకులు గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు.

నల్లమాడ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని అన్ని గ్రామాణ రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లే. ఆ తర్వాత వాటి నిర్వహణ.. మరమ్మతుల గురించి అటు పాలకులు... ఇటు అధికారులు ఏనాడూ పట్టించుకొన్న పాపానికి పోలేదు. ఏగ్రామానికెళ్లాలన్నా గుంతమయమైన రోడ్లే దర్శనమిస్తాయి. అత్యవసర సమయంలో ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకానికి వెళ్లినట్లే. ఈ రోడ్లపై కనీసం ద్విచక్రవాహనం వెళ్లాలంటే కూడా ఇబ్బందిగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం కూడా రాలేని దుస్థితి ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అయినా.. పల్లె పండుగ పేరుతో గ్రామీణ రోడ్లను బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● రాగానిపల్లి నుంచి రాగానిపల్లి తండా రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. రాగినిపల్లి తండా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు మట్టి రోడ్డే. అది గుంతలమయంగా ఉంది. వర్షం వస్తే ఈ మట్టి రోడ్డు మొత్తం బురద.. బురద.. అనేక మంది ద్విచక్రవాహనదారులు జారి పడి గాయపడ్డారు.

● మలకవేమల - నల్లమాడ ప్రధాన రోడ్డు నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలో శీతివారిపల్లి ఉంది. దాదాపు 30 యేళ్ల కిత్రం తార రోడ్డు వేశారు. అప్పటి నుంచి నేటి వరకు దానికి కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. తార రోడ్డు మొత్తం పోయి.. కంకర తేలింది. ఈ గ్రామానికి కనీసం 108 వాహనం కూడా రాదు.

● నల్లమాడ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో చెరువువాండ్లపల్లి ఉంది. 20 ఏళ్ల క్రితం తార రోడ్డు వేశారు. ఈ రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. ఈ గ్రామానికి బస్సులు రావు. అధిక డబ్బులు ఇస్తామన్నా ఆటో వాళ్లు రామని తెగేసి చెబుతున్నారు. కొత్తపల్లి గ్రామస్థులకూ ఇదే రోడ్డు. ద్విచక్రవాహనంలో వెళ్తే పంచర్ కాకతప్పదు.

● కదిరి నుంచి దొన్నికోట మీదుగా చౌటకుంటపల్లికి ఉన్న ఒకటిన్నర కిలోమీటర్ లింక్ రోడ్డు కూడా శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ఎద్దులవాండ్లపల్లి, చౌటకుంటపల్లి, మూలప్పగారిపల్లి, దొన్నికోట మీదుగా కదిరికి మూడు బస్సులు వెళ్లేవి. రోడ్డు బాగలేకపోవడంతో అధికారులు రెండు బస్సులను రద్దు చేశారు. ప్రస్తుతం ఒక బస్సే వస్తోంది. ఆ బస్సు కూడా నల్లమాడ నుంచి ఎద్దలవాండ్లపల్లి తండా మీదుగా మూలప్పగారిపల్లి, దొన్నికోట మీదుగా కదిరికి వెళ్లతోంది. రోడ్డు బాగలేకపోవడంతో చౌంటకుంటపల్లికి బస్సు నడపడం లేదు.



రాగానిపల్లి - రాగానిపల్లి తండా మట్టిరోడ్డు



శీతివారిపల్లి రహదారి

● నల్లమాడ నుంచి కుటాలపల్లి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఉన్న తార రోడ్డు మొత్తం గుంతలమయం. నల్లమాడ నుంచి పెద్దకోట్లపల్లి రోడ్డు దుస్థితి మరీ అధ్వానం. దశాబ్దాలుగా ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం







కదిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట, ఓడీసీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, ధర్మవరం కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్

కదిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... రూ వందతో రూ. ఐదు లక్షల బీమా కల్పించడం హర్షితగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో పర్వీనాబాను, అనిల్‌కుమార్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, బాహద్దీన్, కుటాగుళ్ల శంకర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి సమస్యను పరిష్కరించుకోలేని జగన్..

వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇంటి సమస్యను పరిష్కరించుకోలేక తల్లిని, చెల్లిని కంటతడి పెట్టిస్తున్నారని, అలాంటి వాడు రాష్ట్ర సమస్యలను ఎలా పరిష్కరిస్తారని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. అందుకే జగన్‌ను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. కదిరిలో కొంతమంది వైసీపీ నాయకులు తప్పులు చేశారని, అందుకే 40 రోజులుగా పరారీలో ఉన్నారని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనపై 23 కేసులు పెట్టారని, అందులో హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులున్నాయని, వాటికి భయపడి తాను ఏనాడు ఊరి వదిలి పారిపోలేదని అన్నారు. రియల్ ఎస్టేట్ పేరుతో మోసం చేసిన వైసీపీ నాయకులు సరైన లేఅవుట్ వేసి ప్రజలకు న్యాయం చేయాలని, లేకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

● ఓబుళదేవరచెరువు / నల్లమాడ : ఓడీసీలోని టీడీపీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు కొర్లకుంట ఆంజనేయులు, నాయకులు బోయపల్లి శివారెడ్డి, కన్వీనర్ శెట్టివారి జయచంద్రా పాల్గొన్నారు. అలాగే నల్లమాడలో మండల కన్వీనర్ మైలే శివశంకర్ నివాసంలో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రారంభించారు. ఇందులో నాయకులు సలాంఖాన్, రాజారెడ్డి, బుట్టి నాగభూషణ నాయుడు, గడ్డం రమణారెడ్డి, ఉత్తమరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, మైలే రామచంద్ర, కులశేఖర్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ

ఓబుళదేవరచెరువు : ఉపాధి పథకం కింద రైతులకు పండ్లతోటల పెంపకానికి కావలసిన పండ్ల మొక్కలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి శనివారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతరాచారి, ఎంపీడీఓ రాబర్టువిల్సన్, ఏపీఓ సుధాకర్, సాంకేతిక సహాయకులు రాజారెడ్డి, శివప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు నివాళి

పుట్టపర్తిరూరల్ / బుక్కపట్నం : పుట్టపర్తి మండలంలోని నిడిమామిడి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాకలి రామాంజినేయులు మరణించడంతో ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి నివాళులర్పించారు. అలాగే బుక్కపట్నానికి చెందిన టీడీపీ మహిళ కార్యకర్త పాతిమా అనారోగ్యంతో మరణించడంతో ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

● ధర్మవరం : ధర్మవరంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, పణికుమార్, సంధారాఘవ, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, పల్లపు రవీంద్ర, తిరువీదుల రవీంద్ర పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

పట్టణంలోని గాంధీనగర్, శ్రీదేవి థియేటర్ ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు పరిటాల శ్రీరామ్ సూచించారు. ఆయన పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. గాంధీనగర్‌లో ఉన్న కబరస్తాన్‌లో వర్షపు నీరు భారీస్థాయిలో ఉండటాన్ని గుర్తించి.. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు.

అదేవిధంగా ధర్మవరం వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తల్లి ఇటీవల హత్యకు గురికావడంతో పరిటాల శ్రీరామ్ ఆ సీఐను పరామర్శించారు.

పురుగుమందు దుకాణాల తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కదిరి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రసాయన, పురుగుమందుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు శనివారం తనిఖీ చేశారు. నిషేధిత గడ్డిమందులు విక్రయిస్తున్నారని శనివారం ఆంధ్రజ్యోతి ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించి ఆయన పట్టణంలోని ఆ దుకాణాలను తనిఖీ చేశారు. నిషేధిత గ్లైపోసెట్ గడ్డిమందును దుకాణాల్లో విక్రయిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ధర్మవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జి హరీశ్‌బాబు పాత్రికేయులకు నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాకే ఓబిలేసు, డోలా రాజారెడ్డి, జింకా రామాంజినేయులు, శ్యామరావు, పామిశెట్టి శివశంకర్, గుండావుల్లయ్య, నబీరసూల్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఏకగ్రీవం

పుట్టపర్తి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహిళా అర్బన్ జిల్లా సమాఖ్యను స్థానిక మెప్మా కార్యాలయంలో శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పీడీ విశ్వజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన మెప్మా ప్రతినిధులు సమావేశంలో ఈ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షురాలుగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా సిరిన్, ప్రధాన కార్యదర్శిగా ఒక్కలం పద్మావతి, సహాయ కార్యదర్శిగా పద్మావతి, కోశాధికారిగా కాంతమ్మను ఎన్నుకున్నారు.

తూనికలు, కొలతల పరిశీలన

బుక్కపట్నం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డీలర్ల స్కేల్‌ను తూనికలు, కొలతలను ఆ శాఖాధికారి మహమ్మద్‌గౌస్ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి.. సీల్ వేశారు. తహసీల్దార్ షబుద్దీన్ మాట్లాడుతూ.. తూకాల్లో మోసాలకు పాల్పకుండా.. ప్రతి డీలరు స్కేల్‌కు ముద్ర వేయించుకోవాలని, లేకుంటే రూ.25 వేలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, డీలర్లు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాజుకుంటపల్లి, హిందూపురం ప్రధాన ర హదారిలో ఎస్ఐ కె. మల్లికార్జునరెడ్డి, సిబ్బంది శనివారం వాహనాలు తనిఖీ చేశారు. వారి వెంట పోలీసులు బాబ్‌జాన్, గోవిందు ఉన్నారు.

ఇది చోరుల ప్రాంగణం.!

- సెల్‌ఫోన్ దొంగల అడ్డాగా ధర్మవరం బస్టాండ్
- ఆరునెలల్లో 300 పైగా మాయం
- ప్రయాణికులే కాదు.. డ్రైవర్, కండక్టర్లూ బాధితులే
- కానరాని నిఘా నేత్రాలు.. పట్టించుకోని అధికారులు





బస్సు వద్ద రద్దీ

ధర్మవరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ధర్మవరం బస్టాండ్... సెల్ ఫోన్ దొంగలకు నిలయంగా మారింది. బస్సు ఎక్కే సమయంలో ప్రయాణికులు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా... వారి సెల్‌ఫోన్లు క్షణాల్లో మాయం అవుతున్నాయి. బాధితుల్లో డ్రైవర్, కండక్టర్లూ ఉన్నారు. కొన్ని నెలలుగా ఓ ప్రత్యేక ముఠా ఈ బస్టాండ్‌నే టార్గెట్‌గా చేసుకుని సెల్‌ఫోన్లు దొంగలిస్తున్నట్లు సమాచారం. పుట్టపర్తికి వెళ్లే బస్సులన్నీ ఈ బస్టాండ్ మీదుగా వెళ్తుంటాయి. దీంతో ఈ బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. స్టాండ్‌లోకి బస్సు రాగానే పదుల సంఖ్యలో ప్రయాణికులు బస్సులో సీట్ల కోసం పోటీ పడుతుంటారు. అదే సమయంలో ఆ బస్సులో నుంచి దిగే ప్రయాణికులు ఉంటారు. ఇలా బస్సు ఎక్కేవారి.. దిగేవారి తోపులాటలో సెల్‌ఫోన్ చోరీలు తమ చేతికి పని చెబుతున్నారు. తమ సెల్ చోరీకి గురైందని బాధితులు గుర్తించేలోపే.. ఆ సెల్‌ను స్విచ్ ఆఫ్ చేస్తున్నారు. రూ. 10 వేలు.. రూ. 12 వేల సెల్‌ఫోన్ అయితే.. బాధితులు ఏదో మా ఖర్మలే అని సరిపెట్టుకొంటున్నారు. అయితే రూ. 40 వేలు.. రూ. 50 వేల సెల్‌ఫోన్లు పోతే బాధితులు లబోదిబోమంటూ అధికారులకు.. పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే వారు ఆ ఫిర్యాదుల గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో .. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో సెల్‌ఫోన్ దొంగలు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చిలమత్తూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒంటరితనం, అనారోగ్యం భరించలేక కోడూరు గ్రామానికి చెందిన గోరంట్ల రంగయ్య (65) చెట్టుకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోరంట్ల రంగయ్య భార్య ఎనిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అతని ఇద్దరు కూమార్తెలుకు వివాహమై అతనికి దూరంగా ఉంటున్నారు. దానికి తోడు అతడిని ఆస్మా, ఇతర జబ్బులు పట్టి పీడిస్తుండటంతో మనస్థాపానికి గురైన అతడు శుక్రవారం రాత్రి కోడూరు తోపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనకాల చెట్టుకి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం అటుగా వెళ్లినవారు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించారని ఎస్.ఐ మున్నీర్ అహమ్మద్ తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

మడకశిర రూరల్, అక్టోబరు 26 :(ఆంధ్రజ్యోతి) మండలంలోని మణూరు గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు స్వామి వారి హుండీని ఎత్తుకెళ్ళారు. ఈ విషయాన్ని ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు గమనించి శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై పరిశీలించి తగుచర్యలు తీసుకొంటామని సీఐ రామారావు తెలిపారు.

కళాశాలకు కంప్యూటర్ల వితరణ



ప్రిన్సిపాల్‌కు కంప్యూటర్లు అందజేస్తున్నదృశ్యం

పెనుకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) :స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వవిద్యార్థులు రూ.2లక్షల కంప్యూటర్లను అందజేశారు. పెనుకొండ మాజీ సర్పంచ్ దివంగత కోడి పద్మనాభయ్య కుటుంబ సభ్యులైన పర్వత వర్దిని జ్ఞాపకార్థం డా. సుజాత, కేపీ నీరజ, కేపీ త్రివేణి, కేపీ శ్రీనివాసమూర్తి, రాజేష్, ప్రసాద్ తదితరులు ఆరుకంప్యూటర్లను ప్రిన్సిపాల్ సుదర్శన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇదే కళాశాలలో చదివి ఈరోజు ఉన్నతమైన స్థాయిలో ఉన్నామంటే అందుకు అప్పటి అధ్యాపకులే కారణమన్నారు.

రేపు గోరంట్లలో ప్రజాదర్బార్

గోరంట్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల కాంప్లెక్సు వద్ద ఈనెల 28న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మారుతి శనివారం ఓప్రకటనలో తెలిపారు. మండలస్థాయిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, ప్రజా వేదిక ద్వారా పరిష్కస్తామన్నారు. గోరంట్లలోనివెలుగు కార్యాలయంలో సోమవారం జరిగే కార్యక్రమానికి బిసి సంక్షేమ చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారని, ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భర్త అదృశ్యంపై కేసు

పెనుకొండ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : తన భర్త 45రోజుల నుంచి కనబడటంలేదని అడదాకులపల్లి గ్రామానికి చెందిన మీనాక్షి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గోరంట్ల పట్టణానికి చెందిన అంజినప్ప కుమార్తె మీనాక్షికి అడదాకులపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు కుమారుడు పవన్‌కుమార్‌తో ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం జరిగింది. అక్టోబరు 9న తన భర్త పవన్‌కుమార్ గోరంట్ల నుంచి అడదాకులపల్లి గ్రామానికి వెళ్లి ఉద్యోగం కోసం బెంగళూరు వెళుతున్నట్లు ఫోన్‌లో చెప్పాడన్నారు. అయితే అప్పటి నుంచి ఫోన్ స్విచ్‌ఆఫ్ అయిందని కనిపించకుండా పోయాడని మీనాక్షి ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుండె వైద్య శిబిరానికి భారీ స్పందన

లేపాక్షి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. మండల వ్యాప్తంగా వచ్చిన రోగులకు గుండె వైద్య నిపుణులు మార్క్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ మండల కన్వీనర్ జయప్ప హాజరై రోగుల సౌకర్యాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకుల రమేష్ పాల్గొన్నారు.

పాపం! ఎంత కష్టమొచ్చిందో?

- ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

చిలమత్తూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒంటరితనం, అనారోగ్యం భరించలేక కోడూరు గ్రామానికి చెందిన గోరంట్ల రంగయ్య (65) చెట్టుకి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోరంట్ల రంగయ్య భార్య ఎనిదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అతని ఇద్దరు కూమార్తెలుకు వివాహమై అతనికి దూరంగా ఉంటున్నారు. దానికి తోడు అతడిని ఆస్మా, ఇతర జబ్బులు పట్టి పీడిస్తుండటంతో మనస్థాపానికి గురైన అతడు శుక్రవారం రాత్రి కోడూరు తోపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనకాల చెట్టుకి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం అటుగా వెళ్లినవారు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించారని ఎస్.ఐ మున్నీర్ అహమ్మద్ తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ సభ్యుడిగా రామాంజినప్ప



ఉత్తర్వులు స్వీకరిస్తున్న రామాంజినప్ప

పరిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : బీచిగానిపల్లి గ్రామానికి చెందిన రామాంజినప్ప సత్యసాయి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సెల్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపైనమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు, అధికారులు, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్యవేదిక అధ్యక్షులు శివరామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల నుంచి ఉమాశంకర్ నియామకం



గోరంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి జిల్లా సంక్షేమ శాఖ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా దేవరకొండ ఉమాశంకర్ నియమితు లయ్యారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ జిల్లా కలెక్టర్ పిఎస్ చేతన్ నూతన కమిటీని ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

గుడిబండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు గ్రామ సమీపంలో వెలిసిన అంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించి ఆకుపూజ, అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అనేక మంది పాల్గొని స్వామివారిని దర్శించుకొన్నారు.

రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి

అగళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయశాఖ అధికారి శేఖర్‌నాయక్ తెలిపారు. రబీ సీజన్లో వరి, వేరుశనగ, టమోటా, పంటలు సాగుచేసిన రైతులే పంటల బీమా చేయించుకోవాలని ఆయన కోరారు. వరికి డిసెంబర్ ఆఖరులోపు వేరుశనగ టమోటా పంటలకు డిసెంబర్ 15లోపు నమోదు చేసుకోవాలన్నారు. వరికి రూ.630, వేరుశనగ రూ.480, టమోటా రూ.1600 ప్రీమియం రైతులే చెల్లించాలన్నారు. మీసేవ సచివాలయంలో రైతులు బీమా ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దిగ్బంధంలో గంగాదేవి పల్లె



కంకరపరచి వదిలేసిన బూదిలివైపు వెళ్లే రోడ్డు

- గ్రామం నుంచి బయటపడాలంటే అడ్డంకిగా మారిన రోడ్డు
- ఏ దోవన వెళ్లాలన్నా సర్కస్ ఫీట్లు తప్పవు

గోరంట్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్లుగా తయారైంది మండలంలోని బూదిలి పంచాయతీ గంగాదేవిపల్లెవాసుల పరిస్థితి. దీంతో ఎటుపోవాలో తెలియని విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి బయట ప్రపంచానికి వెళ్లే రోడ్డు సరిగాలేక గ్రామం నుంచి బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కేంద్రం బూదిలికి వెళ్లాలంటే ఆర్అండ్‌బి రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల దూరం కంకరరోడ్డు ఉంది. గతంలో దీనికి మరమ్మతు చేయాలని కంకరపరిచినా, వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన నేటికి తారురోడ్డుగా మారలేదు. కంకరపై నడవాలన్నా, వాహనంలో పోవాలన్నా తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. మరోవైపు నుంచి గోరంట్లకు వెళ్లాలంటే మధ్యలో సింగిరెడ్డిపల్లి ఆర్అండ్‌బి రోడ్డు వరకు మూడుకిలోమీటర్లు మట్టిరోడ్డే. ఈ దోవ వర్షాకాలం వస్తే నీటితో బురదమయంగా మారి రాకపోకలకు అంతరాయంగా మారుతోంది. ఎవరూ తమ బాధలను పట్టించుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్లకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌నాయక్‌ను వివరణ కోరగా గంగాదేవిపల్లికి ఇరువైపుల గల రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ప్రస్తుతం ఈ రహదారులకు నిధులు మంజూరుకాలేదన్నారు.



బురదమయంగా మారిన సింగిరెడ్డిపల్లి వైపు వెళ్లే రోడ్డు

మడకశిరను అగ్రగామిగా నిలుపుదాం

- టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో మడకశిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శనివారం మడకశిర పట్టణంలోని బాలాజీ నగర్ టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి ఆయన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో దూరదృష్టి ఉన్న నేత అని, దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీ సభ్యత్వం తీసుకొనే వారు రూ.5లక్షల ప్రమాదబీమా పొందేలా మొట్టమొదటి సారిగా చర్యలు తీసుకొన్నారన్నారు. పార్టీలో పేదలకు, పార్టీ కోసం కష్టపడే వారికి సభ్యత్వ నమోదు ఎంతో ఉపయోగపడే విధంగా ముఖ్యమంత్రి ఆలోచించి రూపొందించినట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సైతం చంద్రబాబు ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా రాష్ట్రంలోనే ఒకటి నుండి ఐదో స్థానంలో మడకశిరను నిలిపిన ఘనత నియోజకవర్గ కార్యకర్తలకు దక్కుతుందన్నారు. ఇదేం ఖర్మ, బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంతోపాటు ఏకార్యక్రమానికి పిలుపునిచ్చినా ఎంతో చిత్తశుద్ధితో అంకిత భావంతో కృషి చేసి నిలిపారన్నారు. ప్రస్తుతం మడకశిర నియోజకవర్గాన్ని సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదామని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు డాక్టర్ కృష్ణమూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, వి.ఎం. పాండురంగప్ప తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును స్వీకరించి రసీదు చూపుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

తురకలాపట్నం, కోగిర చెరువులకు మరమ్మతు



చెరువు కట్టకు మరమ్మతులు చేస్తున్న అధికారులు, నాయకులు

పెనుకొండ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రొద్దం మండలంలోని చెరువులకు పడిన గండ్లను పూడ్చివేశారు. బీసీ సంక్షేమం చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు రొద్దం మండలం తురకలాపట్నం, కోగిర చెరువుకు గండిపడకుండా ముందస్తుగా చెరువుకట్టకు ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తురకలాపట్నం చెరువుకట్టపై భారీ వృక్షం నేలమట్టం కావడంతో చెరువుకట్ట పాక్షికంగా దెబ్బతింది. గమనించిన స్థానికులు వెంటనే మంత్రికి సమాచారం అందించారు. మంత్రి ఆదేశాలతో ఇరిగేషన్ ఈఈ రాధకృష్ణ, డీఈ లక్ష్మీనారాయణ, యుద్ధప్రాతిపదికన తురకలాపట్నం చెరువుకట్ట తెగకుండా ఇసుక బస్తాలు వేశారు. అనంతరం కోగిర చెరువుకట్టకు మట్టితోలి మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ సిబ్బంది, టీడీపీ నాయకులు మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల వేతనాలు పెంచాలి

పెనుకొండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు గౌరవవేతనం పెంచాలని కోరుతూ సీఐటీయు నాయకులు తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. సీఐటీయు నాయకులు రమేష్, బాబావలి, రాజారావు, ఆటో నాగప్ప, తిప్పన్న, తదితరులు వినతిపత్రం అందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా 85వేల మంది భోజన ఏజెన్సీ కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు 7గంటల నుంచి 8గంటల పాటు పనిచేస్తునారని, వీరు కేవలం రూ.300 వేతనంతో వెట్టిచాకిరి చేస్తున్నారన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువులకు అనుగుణంగా వీరి జీతాలను కూడా ప్రభుత్వం పెంచాలన్నారు. ప్రభుత్వం రకరకాల మెనూలతో కార్మికులపై భారం వేస్తున్నదన్నారు. మెనూ ప్రకారం ఒక్కొక్క విద్యార్థికి రూ.20 పెంచాలని ఆ తరువాత నూతన మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులకు తగ్గట్టు వర్కర్లు లేకపోవడంవల్ల పనిభారం ఎక్కువ అవుతుందని, కనుక వర్కర్ల సంఖ్యను పెంచాలన్నారు. ప్రమాదాలలో గాయపడ్డ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, మంచినీరు వంట షెడ్డు, యూనిఫాం తదితర మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు.



తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయు నాయకులు

వైద్యుల కొరత లేకుండా చూస్తాం

- ఎంపీ గోవింద కార్‌జోళ

పావగడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం వ్యాప్తంగా వైద్యుల కొరత ఏర్పడ కుండా సంబంధిత అధికారులతో చర్చించి త్వరలోనే వైద్యులను నియమిస్తామని చిత్రదుర్గం ఎంపీ గోవింద కార్‌జోళ తెలియజేశారు. శనివారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో అతి వెనకబడిన తాలూకాగా పావగడ పేరుగాంచిందని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రిజర్వేషన్ క్షేత్రమైన పావగడ అన్ని విధాలా అభివృద్ధిలో వెనకబడిందని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎంతో అధునాతనంగా నిర్మించినా ఇక్కడ వైద్యుల కొరత ఏర్పడుతోందని, సంబంధిత అధికారులతో చర్చించి వైద్యుల నియామకానికి ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. అదేవిధంగా ఇటీవల కురిసిన వర్షాలకు అనేక వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏబీసీడీ వర్గీకరణకై తాలూకాలోని దళిత బాంధవులు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జేడీఎస్ నాయకులు చెన్నమల్లయ్య, ఎం.కె.నారాయణప్ప, తిమ్మారెడ్డి, గంగాధర్‌నాయుడు, అనేక మంది నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోవింద కార్‌జోళ

కార్యకర్తలే టీడీపీ బలం

హిందూపురం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశంపార్టీకి కార్యకర్తలే బలమని నాయకులు అన్నారు. శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పంచాయతీ పరిధిలో బూత్ లవారీగా సభ్యత్వ నమోదు ప్రారంభమైంది. హిందూపురం పట్టణంలో ఆ పార్టీ పట్టణ కన్వీనర్ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వనమోదు కార్యక్రమంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఉన్న కార్యకర్తలు దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేరన్నారు. సభ్యత్వ నమోదు రూ.వంద కట్టి తీసుకుంటే రూ.5లక్షల ప్రమాదబీమా పొందవచ్చన్నారు. కార్యకర్తల అభ్యున్నతికి వారి కుటుంబాలకు తోడుగా ఉండేందుకు ఎప్పుడు పార్టీ ముందుంటుందన్నారు.



పురంలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కార్యకర్తలకు అండగా ఉండేది టీడీపీనే

పెనుకొండ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోనే కార్యకర్తలకు అండగా ఉండేది ఒక్క తెలుగుదేశం పార్టీయేనని పట్టణ కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. స్థానిక పార్టీకార్యాలయంలో శనివారం ఆయన టీడీపీ సభ్యత్వ నమోదుకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సూచనమేరకు ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ప్రారంభించినట్లు తెలిపారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే వారి పిల్లల విద్యాభ్యాసం బాధ్యత టీడీపీ తీసుకుంటుందని తెలిపారు.



సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు

మునిమడుగు గ్రామంలో

పెనుకొండ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మునిమడుగు గ్రామంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నవెంకటరాముడు, మండల కన్వీనర్ సిద్దయ్య, టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం 200మంది సభ్యులుగా చేరినట్లు కన్వీనర్ సిద్దయ్య తెలిపారు.

ఎన్నికలకు సిద్ధం కండి

పావగడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాబోవు తాలూకా పంచాయతీ, జిల్లా పంచాయతీ ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా సిద్ధం కావాలని ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయిరాం మందిరంలో కాంగ్రెస్ కమిటీ తరపున జిల్లా స్వాభిమాన కార్యకర్తల సమావేశంలో ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. తాలూకా వ్యాప్తంగా తనతండ్రి బాటలోనే అభివృద్ధి పనులకు గత ఒకటిన్నర సంవత్సరం చేస్తున్నందు వల్ల ఎన్నో ఏళ్లుగా కలలు కన్న తుంగభద్రా తాగునీరు పావగడకు రావడం అందరికీ తెలిసిన విషయమేనని ఆయన తెలిపారు. మరిన్ని అభివృద్ధి పనులకు తాలూకా జిల్లా పంచాయతీ సభ్యులు కలిసికట్టుగా వస్తే అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేయవచ్చని ఆయన తెలిపారు. పని చేసేవారికే పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ అధ్యక్షులు రాజేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదేష్‌బాబు, రామాంజనప్ప, అమర్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యానికి సర్వర్ సమస్య

పావగడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న బీపీఎల్ కార్డుదారులకు రేషన్ బియ్యం తీసుకోవాలంటే సర్వర్ సమస్య వెంటాడుతోంది. ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రేషన్ బియ్యం పింపిణీ చేయాలని ఆహార శాఖనుండి ఆదేశాలు అందడంతో సర్వర్ సమస్య డీలర్లకు తలనొప్పిగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి నెట్వర్క్ ప్రారంభం కావడంతో ఉదయం నుండి సాయంత్రం వరకు ఒక్కొక్కసారి రాత్రి పూట కూడా డీలర్ షాపుల వద్ద బారులు తీరినా ఇటు బియ్యం దొరక్క, అటు కూలీ పనులు లేక నష్టపోతున్నామని కార్డుదారులు వాపోతున్నారు.

ఇసుక దందాను అరికట్టండి



జయమంగళి నదిలో ఇసుక నింపుకుంటున్న ట్రాక్టర్లు

పరిగి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జయమంగళి, పెన్నా నది తీరప్రాంతాల్లో ఇసుక దందాకు అడ్డు అదుపులేకుండా పోతోందని దీనిని అరికట్టాలని శనివారం రెవెన్యూ కార్యాలయం ముందు దాసరపల్లి, శాసనకోట గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. హిందూపురం, లేపాక్షి, పెనుకొండ, సోమందేపల్లి ప్రాంతాల వారు రాత్రింబగళ్లు తేడాలేకుండా ప్రొక్లైన్‌లతో వందలాది ట్రాక్టర్లు నింపుతూ ఇసుకను వేలల్లో అమ్ముకుంటున్నారని వారు ఆరోపించారు. నదిపరీవాహక ప్రాంతాల్లో ఉన్న బోర్లు ఇసుక తరలింపుతో ఎండిపోతున్నాయని పంట పొలాలు నాశనం అవుతున్నాయని పంటలు చేతికందక రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ విషయమై డీటీ నరసింహంకు వినతిపత్రం అందించారు. ఇసుక దందాను అరికట్టాలంటూ ఎస్‌ఐ రంగడును కూడా గ్రామస్థులు కోరారు.

గుడిబండలో కంటి పరీక్షలు



వైద్యశిబిరంలో పేర్లు నమోదు చేసుకొంటున్న ప్రజలు

గుడిబండ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్‌ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆస్పత్రి వైద్యాధికారులు అఖిల్ శిబిరాన్ని నిర్వహించారు. ఈవైద్య శిబిరానికి చుట్టుపక్కల గ్రామస్తులు 120 మంది వచ్చి కంటి పరీక్షలు చేయించుకొన్నారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు అన్ని సదుపాయాలు కల్పించారు. అందులో కంటి ఆపరేషన్ల కోసం 40 మందిని ఎంపిక చేసి బెంగళూరు ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఐతోపాటు ఏఎస్‌ఐ చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీ

మడకశిర రూరల్, అక్టోబరు 26 :(ఆంధ్రజ్యోతి) మండలంలోని మణూరు గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు స్వామి వారి హుండీని ఎత్తుకెళ్ళారు. ఈ విషయాన్ని ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు గమనించి శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై పరిశీలించి తగుచర్యలు తీసుకొంటామని సీఐ రామారావు తెలిపారు.

ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొని ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులేకమ్మ ఆలయంవద్ద 44వ జాతీయరహదారిపై శనివారం రాత్రి ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొని రామాంజినేయులు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమందేపల్లిలోని గీతానగర్‌కు చెందిన రామాంజినేయులు ద్విచక్రవాహనంలో పెనుకొండ వైపు వస్తూ పులేకమ్మ ఆలయంవద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రామాంజినేయులు తీవ్రంగా గాయపడగా స్థానికులు హుటాహుటిన 108సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనోహర్ కుటుంబానికి పరామర్శ



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న దృశ్యం

మడకశిరటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ ఇంటికి శనివారం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఎం.ఎస్.ఉమాదేవి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. పిల్లల చదువులకు, కుటుంబ యోగక్షేమానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఇంత చిన్న వయస్సులోనే మనోహర్ అకాల మృతి చెందడం ఆవేదనకు గురి చేసిందన్నారు.

వాల్మీకి జయంతిలో టీడీపీ ఉపాధ్యక్షుడు

మడకశిర రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) మండలంలోని రామగిరి గ్రామంలో శనివారం జరిగిని వాల్మీకి జయంతి ఉత్సవాల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమ తిప్పేస్వామి పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన వాల్మీకి విగ్రహాన్ని అవిష్కారించారు. అ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ,మాజీ ఎంపీటీసీ నాభూషణ్ రెడ్డి ,మాజీ సర్పంచు నాగరాజు నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిలమత్తూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేపల్లి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్.ఐ మున్నీర్ అహమ్మద్ శనివారం తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5720లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుతున్నా వెంటనే తమకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు.